నేటి నుంచి తార్నాకలో గర్బా, దాండియాలో శిక్షణ

లాలాపేట: సీఎస్‌ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం (ఈ నెల 16 నుంచి 30 వరకు) తార్నాకలోని మర్రి కృష్ణా హాల్‌ల్లో గర్బా, దాండియాలో శిక్షణ ఇస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఈ శిక్షణా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల వారు 63038 68045లో సంప్రదించవచ్చు.

ప్రొఫెసర్ నవీన్‌కుమార్‌కు ఐఈటీఈ జాతీయ అవార్డు


ప్రొఫెసర్ కె.శ్రీనివాసన్ మెమోరియల్ జాతీయ అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ నవీన్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇన్‌ఫ్రా అండ్ ఎస్టేట్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ పెరుమాళ్ల నవీన్ కుమార్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది. ప్రొఫెసర్ కె.శ్రీనివాసన్ మెమోరియల్ ఐఈటీఈ జాతీయ అవార్డు–2024ను ఆయన ఆదివారం అందుకున్నారు. భోపాల్‌లోని ఐఈఎస్‌ఈ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన 67వ వార్షిక ఐఈటీఈ టెక్నికల్ కన్వెన్షన్‌లో ప్రొఫెసర్ నవీన్‌కుమార్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ రంగంలో బోధనలు, పరిశోధనల ఆవిష్కరణల రంగంలో నవీన్‌కుమార్ 120కి పైగా పరిశోధనలు చేసి, పత్రాలను ప్రచురించారు. ఇందుకోసం ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేసినట్టు ఐఈటీఈ జాతీయ అవార్డు–2024 కమిటీ ప్రతినిధులు ప్రకటించారు.

గాంధీభవన్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


నాయకులు, కార్యకర్తలతో బయలుదేరిన శ్రీగణేష్

రసూల్‌పురా: గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస కమిటీ నూతన అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి వెళ్లి మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

సనత్‌నగర్: గణేశ్ శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా భక్తులు, ప్రజలకు ఇబ్బందుల్లేకుండా అధికారులు చూడాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గణేశ్ నవరాత్రులు, నిమజ్జనంలో దేశంలోనే హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, వీక్షించేందుకు నగరం నుంచే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగేలా చూడాలని కోరారు.

ఇంజినీర్లకు సత్కారం



లక్డీకాపూల్: ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని ఇంజినీరింగ్ రంగంలో విశిష్ట సేవలందిస్తున్న పలువురు ఇంజినీర్లను ఘనంగా సత్కరించారు. సికింద్రాబాద్‌లోని లయన్స్ భవన్‌లో ఇంజినీర్స్ దినోత్సవ వేడుకలు జరిగాయి. లయన్స్ ఇంటర్నేషనల్ 320సి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో, జెన్‌కో, విద్యుత్ పంపిణీ సంస్థలకు చెందిన ఇంజినీర్లతో పాటు వాటర్ బోర్డు ఇంజినీర్లు, ప్రైవేటు రంగంలో విశిష్ట సేవలందిస్తున్న ఇంజినీర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యాక్రమంలో లయన్స్ జిల్లా చైర్మన్ బీఆర్ రావు, ప్రతినిధి ఎం.రాములు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.33, నల్లవంకాయ 55, పొడుగు వంకాయ 45, బెండకాయ 50, పచ్చిమిర్చి 18, బజ్జీమిర్చి 65, క్యాప్సికం 70, పచ్చకాకర 57, పందిరి బీర 55, క్యాబేజీ 17, క్యారెట్ 50, దొండ 45, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 90, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 23, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 44, ఆలుగడ్డ 37, చామగడ్డ 40, మొరంగడ్డ 55, కందగడ్డ 65, సొరకాయ 27, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

బీరప్ప, కురుమ కుల చరిత్ర పుస్తకాల ఆవిష్కరణ

బంజారాహిల్స్: బీరప్ప, కురుమ కుల చరిత్ర పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం వ్యవస్థాపకుడు ముత్త సంపత్‌కురుమ, కార్యనిర్వాహక అధ్యక్షుడు రమేశ్‌కురుమ, కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరుల సమక్షంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సంచార వర్గానికి చెందిన కురుమలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీ తీర్మాణం చేసి పార్లమెంట్‌కు పంపాలని డిమాండ్ చేశారు. సబ్సిడీ గొర్రెల పథకానికి డబ్బులు కట్టిన ప్రతి లబ్ధిదారుడికి నెల రోజుల్లో రూ. 2 లక్షలు ఖాతాలో జమ చేయాలన్నారు. కురుమ కార్పొరేషన్, చైర్మన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని, కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ పదవిని కురుమలకే ఇవ్వాలని దాదాపు 11 డిమాండ్ల సాధనకు కలసికట్టుగా పోరాడాలని తీర్మానం చేశారు. కురుమ సంఘాల నాయకులు శ్యాంకురుమ, రవికుమార్, ఎగ్గే మహేందర్, బెల్లం మాధవి, వంశీ కురుమ, పాండు, నర్రి స్వామి, శ్రీనివాస్, తెలంగాణ ఒగ్గు బీర్ల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధర్మయ్య ఒగ్గు, పృథ్వీరాజ్‌యాదవ్, విఠల్, బీరప్ప పుస్తక రచయిత నాగేషు పాల్గొన్నారు.


మధురానగర్ మట్టిగణపతి నిమజ్జనోత్సవ ర్యాలీలో మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి


సీతాఫల్‌మండి యువ ఫ్రెండ్స్ అసోసియేషన్ మండపం వద్ద..బీసీ రాష్ట్ర నాయకుడు ఆదం విజయ్‌కుమార్


ఇందిరానగర్‌లో..బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్


సికింద్రాబాద్‌లోని ప్రకాష్ నగర్ న్యూ బోయిగూడలో గణేష్ పూజల్లో...


కల్యాణ్‌నగర్ బాలాజీ విహార్ రెసిడెన్షియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూజలందుకుంటున్న గణనాథుడు


సిద్ధివినాయక మండపంలో.. బాలాంజనేయస్వామి ఆలయ చైర్మన్ నాగులూరి సాయిబాబా


ఏక్‌నంబర్‌గల్లీ గణపతి మండపంలో.. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, వీరాంజనేయస్వామి ఆలయ చైర్మన్ చందర్


తార్నాక చింతల్ బస్తీలో.. కేపాల్ బోన్ సెట్టింగ్ వైద్యులు దిలీప్‌రెడ్డి, రఘురామ్‌రెడ్డి

గణపయ్యకు ఘనంగా పూజలు

సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల్లో అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గణేష్ మండపాల వద్ద విశేష పూజలు నిర్వహించి విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు.

– సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ జోన్ల బృందం


బల్కంపేట బీజేఆర్‌నగర్‌లో..


చింతల్‌లో..


తార్నాక లేబర్ అడ్డా వద్ద..


కౌసిక్ అపార్ట్‌మెంట్ మండపంలో పూజలు ..


వారాసీగూడ నేతాజీ కాలనీ గణపతి మండపం వద్ద..


బల్కంపేటలో వినాయకుడి మండపం వద్ద అన్నదానం..


బేగంపేటలో..


పూజల్లో చింతల్ కిట్టు, సందీప్‌రెడ్డి తదితరులు


అమీర్‌పేట సోనాబాయి టెంపుల్ వద్ద అన్నదానం


మాణికేశ్వర్‌నగర్‌లో.. మాజీ కార్పొరేటర్ ఆదం విజయ్‌కుమార్.


మోడల్‌కాలనీలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

కేంద్రమంత్రికి ప్రత్యేక జిల్లా వినతిపత్రం


బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న లష్కర్ సాధనసమితి ప్రతినిధులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలన్న లక్ష్యానికి తనవంతు మద్దతు ఉంటుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో సాధన సమితి ప్రతినిధి బృందం బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ప్రత్యేక పరిస్థితుల కారణంతో సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటును పాలకులు విస్మరించిన విషయాన్ని మంత్రికి వివరించారు. ఫలితంగా సికింద్రాబాద్ ప్రాంత ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు, ఈ ప్రాంతానికి జరుగుతున్న నష్టాన్ని సమితి సభ్యులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన కేంద్ర మంత్రి ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్టు పవన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లష్కర్ సమితి ప్రధాన కార్యదర్శి సాదం బాలరాజ్ యాదవ్, ప్రతినిధులు శైలేందర్, మిట్టపల్లి బాబురావు, కృష్ణముదిరాజ్, శ్రీకాంత్‌రెడ్డి, అజీజ్, అశోక్‌చారి, హరి, సునీల్ ముదిరాజ్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి గోల్డ్‌మెడల్

గాంధీఆస్పత్రి : ఫోరెన్సిక్ మెడిసిన్ ట్యాక్సీకాలజీ అండ్ అటాప్సీ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించిన తిరుమల నాగేంద్రబాబును గాంధీ ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌ఓడీ కృపాల్‌సింగ్, ప్రొఫెసర్ లావణ్యాకౌషిల్, వెంకటనాగరాజు తదితరుల అభినందించారు. గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్నీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చూపిన వైద్యవిద్యార్థులకు గోల్డ్‌మెడల్స్‌తో సత్కరించారు. ఫోరెన్సిక్ మెడిసిన్ ఎండీ విభాగంలో నాగేంద్రబాబుకు బంగారుపతకం రావడంపై గాంధీ ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగ వైద్యులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.


గోల్డ్‌మెడల్ సాధించిన నాగేంద్రబాబును అభినందిస్తున్న గాంధీ ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్యులు

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదులో మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్‌రావు

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చురుగ్గా నిర్వహించారు. సండే మార్కెట్‌లో బూత్ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆ పార్టీ సభ్యత్వ నమోదు స్టేట్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామ్‌చందర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై స్వయంగా కొందరికి సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా రామ్‌చందర్‌రావు మాట్లాడుతూ..పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలనీ అన్నారు. తార్నాక డివిజన్ అధ్యక్షుడు రాము వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జయశ్రీ, హరి, వెంకటేష్‌గౌడ్, పోచయ్యయాదవ్, శ్రీనివాస్‌చారి, గండికోట నర్సింహ్మా, అనిత, ఆకుల శ్రీనివాస్,అనూష, వేణు, దేవా, మహేశ్, గోవర్ధన్, కరుణాకర్, ఉపేందర్ యాదవ్ తదితరులున్నారు.

పోలీసుల తీరుపై భక్తుల ఆగ్రహం

రాంగోపాల్‌పేట్: ఆర్పీరోడ్‌లోని మావురాల పెద్దమ్మ ఆలయం వద్ద మాజీ కార్పొరేటర్ అత్తెల్లి కుటుంబం కొన్నేళ్లుగా వినాయకుడి నవరాత్రులను వైభవంగా నిర్వహిస్తున్నారు. అయితే శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా భక్తులు గణనాథుడి దర్శనానికి బారులుతీరారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ పోలీసు ఉన్నతాధికారిణి, మహంకాళి పోలీసులు అర్ధరాత్రి వేళ ఇంతమంది ఉంటే ఎలా అంటూ ప్రసాదాల పంపిణీ నిలిపేసి లైట్లు ఆపి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది పోలీసులు అక్కడ పనిచేస్తున్న సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారు. దీన్ని వీడియో తీస్తున్న నిర్వాహకుల బంధువును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలీసుల తీరుపై మాజీ కార్పొరేటర్ అత్తెలి మల్లికార్జున్‌గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగుతున్న చోట ఇలా ప్రవర్తించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. భక్తులు కూడా పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఈ విషయమై 'సాక్షి' పోలీసులను వివరణ కోరగా యత్నించగా స్పందించేందుకు వారు నిరాకరించారు.

దసరాలోపు లెక్చరర్ల నియామకం పూర్తి చేయాలి



ఉస్మానియా యూనివర్శిటీ: ఇంటర్మీడియట్ బోర్డు వ్యవస్థను ప్రగతిపథంలో నడిపించడంలో తాము సంపూర్ణ సహకారం అందిస్తామని మెరిట్ రిఫికేషన్‌కు ఎంపికైన జూనియర్ లెక్చరర్ల అభ్యర్థులు ప్రకటించారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల కేంద్రంగా వారి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మెరిట్ లిస్టు వెరిఫికేషన్ జూనియర్ లెక్చరర్ల అభ్యర్థులు మాట్లాడుతూ.. 15 ఏళ్ల అనంతరం జూనియర్ లెక్చరర్ల నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీజీపీసీ చైర్మన్ మహేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా 1392 పోస్టులకు టీజీపీఎస్సీ ద్వారా నియామక ప్రక్రియ చేపట్టడాన్ని వారు అభినందించారు. పీజీ పూర్తిచేసి లెక్చరర్ల వెరిఫికేషన్‌కు ఎంపికై ఉన్న అభ్యర్థులు నియామకంలో జాప్యం ఫలితంగా పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యలు పూర్తి చేశారని వారు చెప్పారు. నియామక ప్రక్రియను ఈ దసరాలోపు ఫైనల్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.